# వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబర్ 21 : బీఆర్ఎస్‌లోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. బాల్కొండ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. మంగళవారం భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన రంజిత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నుంచి యువకులు, గల్ఫ్ నుంచి వచ్చిన ముదిరాజ్ యువకులు, కొత్తతండాకు చెందిన సదర్ మలావత్ మోహన్‌సింగ్‌నాయక్, కొత్త తండా కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గుగులోత్ గంగాధర్‌నాయక్, బత్తిలాల్, దేవక్కపేట్‌కు చెందిన యువకులు, భీమ్‌గల్ మాజీ వార్డు మెంబర్ జావిద్, వేల్పూర్ మండలం కోమన్‌పల్లికి చెందిన బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొత్తింటి పెద్దరాజన్న, రామన్నపేట్ కాంగ్రెస్‌కు చెందిన ముదిరాజ్ యువకులు, వెంకటాపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహేశ్, బాల్కొండ మండల కేంద్రానికి చెందిన శ్రీ ఆంజనేయ యూత్, వడ్ల సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వన్నెల్(బి) అంబేద్కర్ యూత్ సభ్యులు పార్టీలో చేరారు. వారందరికీ మంత్రి వేముల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**వేములకు మద్దతుగా విశ్వబ్రాహ్మణ సంఘం ఏకగ్రీవ తీర్మానం**

బడాభీమ్‌గల్‌కు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు మంత్రి వేములకు మద్దతుగా ప్రకటించారు. ఈ మేరకు వేల్పూర్‌లో వేములను కలిసి ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు.

# సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా: డీసీపీ జైరామ్

రెంజల్, నవంబర్ 21: జిల్లాలో గతంలో చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో అతిసమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు డీసీపీ జైరామ్ తెలిపారు. మంగళవారం రెంజల్ మండలంలోని నీలా, కందకుర్తి గుర్తించిన ఇతర గ్రామాల పోలింగ్ కేంద్రాలను డీసీపీ జైరామ్, ఎన్నికల పర్యవేక్షకురాలు తానియాసింగ్ వేర్వేరుగా పరిశీలించారు. 2019లో నిర్వహించిన ఎన్నికల్లో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు నిఘా వ్యవస్థను మరింత పెంచుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అంతకు ముందు ఎన్నికల వ్యయ పరిశీలకురాలు తానియా సింగ్ కందకుర్తి సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టును తనిఖీ చేశారు. చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహించే వారు నిర్లక్ష్యం చేయవద్దని, అక్రమంగా మద్యం, నగదు తరలించకుండా సమన్వయంతో పని చేయాలని ఆమె ఆదేశించారు.



నీలాలో బీఎల్వోలతో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలన అధికారిణి తానియాసింగ్

**దూద్‌గాం వద్ద చెక్‌పోస్ట్ పరిశీలన**

మెండోరా, నవంబర్ 21 : మెండోరా మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారి దూ ద్గాం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు శక్తి మంగళవారం పరిశీలించారు. నిర్మల్ జిల్లా నుంచి వస్తున్న వాహనాలను పరిశీలించారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహిస్తున్న ఎన్నికలు, పోలీసు సిబ్బందిని అభినందించారు. ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్సై సురేశ్, సీనియర్ అసిస్టెంట్ గంగాధర్, పోలీసు సిబ్బంది గంగాముత్యం, సురేశ్, శ్రీజ ఉన్నారు.

# ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్**



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ఖలీల్‌వాడి, నవంబర్ 21 : ఎలాంటి అనుమానాలకూ తావు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన వివిధ అంశాలకు సంబంధించిన నివేదికలను జాప్యం చేయకుండా సకాలంలో పంపించాలని ఆదేశించారు. 80 ఏండ్లుపైబడి వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు వారి ఇండ్ల వద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా చేపట్టిన ఏర్పాట్లపై ఆయా జిల్లా ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లు, పోలింగ్, కౌంటింగ్ కోసం చేపట్టిన కసరత్తుపై ఆరా తీశారు. పట్టణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం, గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో 60 శాతం వెబ్‌క్యాస్టింగ్ చేయాలని, మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఈవో సూచించారు. నూతన ఓటర్లకు పోస్టల్‌శాఖ ద్వారా ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో ప్రతి ఓటరుకూ సమాచార స్లిప్పులు పంపిణీ చేయాలని, ప్రతిరోజు ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీపై సమీక్ష నిర్వహించాలని సూచించారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి వారికి శిక్షణ అందించారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సూచించారు.

**ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి**

ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి, సువిధ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిర్ణీత గడువులో అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని సూచించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మం తు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మకరంద్, రిటర్నింగ్ అధికారులు రాజేంద్రకుమార్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

# పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు
- ఎన్నికల సిబ్బంది శిక్షణ తరగతుల పరిశీలన



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఖలీల్‌వాడి/ఆర్మూర్, నవంబర్ 21 : ప్రస్తుత శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 30న నిర్వహించనున్న పోలింగ్ ప్రక్రియపై పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగేలా శిక్షణ తరగతుల్లో అన్ని అంశాలను వివరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాస్టర్ ట్రైనర్లకు సూచించారు. ఆర్మూర్ శాసనసభ నియోజకవర్గ ప్రీసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు చేపూర్ వద్ద ఉన్న క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న రెండో విడుత శిక్షణ తరగతులను కలెక్టర్ ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు సుబ్రా చక్రవర్తితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఫెసిలిటేషన్ సెంటర్లు, పీవోలు, ఏపీవోలకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకునేందుకు వీలుగా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. గోప్యతను పాటించేలా ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేశారా, పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన నిర్ణీత ఫారంలు, బ్యాలెట్ పేపర్లు సిద్ధంగా ఉంచారా లేదా అనే వివరాలను తెలుసుకొన్నారు. హాజరు పట్టికను తనిఖీ చేసి శిక్షణ తరగతులకు గైర్హాజరైన పీవో, ఏపీల నుంచి కారణాలు అడిగి తెలుసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతిఒక్కరూ శిక్షణ తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. శిక్షణ తరగతులను చక్కగా అర్థం చేసుకుని పోలింగ్ విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణమైన అవగాహనను ఏర్పర్చుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వినోద్‌కుమార్, స్థానిక అధికారులున్నారు.

# ఏసీబీకి చిక్కిన వ్యవసాయ అధికారి

- ఫెర్టిలైజర్ యజమాని నుంచి రూ.10వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ బిచ్కుంద ఏవో



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ అధికారులు

నిజాంసాగర్/బిచ్కుంద, నవంబర్ 21: ఏసీబీ వలకు ఓ అవినీతి వ్యవసాయ శాఖ చేప చిక్కింది. ఫెర్టిలైజర్ షాపు యజమాని నుంచి లంచం తీసుకుంటూ అధికారి పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్కుంద మండలం గోపన్‌పల్లి గ్రామానికి చెందిన గుండెకల్లూర్ గంగాధర్.. బిచ్కుంద మండల కేంద్రంలో అన్నదాత ట్రేడర్స్ పేరిట ఫెర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతను దుకాణం నడిపించుకోవడానికి ఏటా వ్యవసాయశాఖ అధికారి పోచయ్యకు రూ.18వేల లంచం ఇవ్వాల్సిందే. ఈ క్రమంలో అధికారికి వారం క్రితం రూ.8వేలు ముట్టజెప్పాడు. మిగిలిన రూ. పది వేలు ఇవ్వాలంటూ వ్యాపారికి రోజూ ఫోన్ చేసి ఏవో వేధించసాగాడు. దీంతో గత్యంతరం లేక వ్యాపారి గంగాధర్.. ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు గంగాధర్.. మంగళవారం సాయంత్రం వ్యవసాయశాఖ అధికారి పోచయ్యకు ఫోన్ చేసి రూ. పది వేలు తెచ్చానని, ఎక్కడ కలవాని అడిగాడు. ఆయన బిచ్కుందలోని సిద్ధిరామేశ్వర జనరల్ స్టోర్‌లో డబ్బులు ఇవ్వాలని సూచించారు. దీంతో అతడు షాపులో డబ్బులను అప్పజెప్పాడు. అంతలోనే ఏసీబీ అధికారులు దాడి చేసి సిద్ధిరామేశ్వర దుకాణం యజమానిని అదుపులోకి తీసుకొని వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయశాఖ అధికారి పోచయ్య చెప్పడంతోనే తాను డబ్బులు తీసుకున్నానని వెల్లడించాడు. ఈ మేరకు అధికారులు డబ్బులను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపారు. ఏవో కార్యాలయంతోపాటు పోచయ్య నివాసంలో సోదాలు నిర్వహించి కేసు నమోదు చేశామని చెప్పారు. దాడిలో ఏసీబీ సీఐలు నగేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఖోఖో పోటీల్లో పోచంపాడ్ విద్యార్థుల ప్రతిభ

మెండోరా, నవంబర్ 21: ఉమ్మడి జిల్లాల ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన బాలుర ఖోఖో (అండర్-18) విభాగంలో మండలంలోని పోచంపాడ్ బాలుర గురుకుల కళాశాల, పాఠశాలకు చెందిన విద్యార్థులు తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ తారాసింగ్ తెలిపారు. పోటీలో ప్రతిభ చాటిన కెప్టెన్ కే భరత్‌కుమార్ (ఎంపీసీ సెకండియర్) వైస్ కెప్టెన్ బి. భూమేశ్ (పదో తరగతి) విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఏటీపీ శ్రావణ్ మహేశ్వరం తెలిపారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది.



తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం